# శకునం

-వై.కె.మూర్తి

రామశర్మ గేటు తీసుకుని బైటికి అడుగు పెట్టాడు. ఎదురుగా... తెల్లటి చీరకి ఎఱ్ఱటి బార్డర్ వున్న వెంకటగిరి చీర, ఎఱ్ఱటి జాకెట్టు, నుదుట ఎఱ్ఱటి కుంకుమ పెట్టుకుని, 'ఆమె' ఎదురు వచ్చింది. "అబ్బ! ఎంత అదృష్టం' అని మనసులోనే అనుకుని తాను బైలుదేరిన కార్యం తప్ప కుండా విజయవంతం అవుతుందనుకున్నాడు.

రామశర్మకి జాతకాల పిచ్చి, శకునాల పిచ్చి, అడుగు తీసి అడుగు వేయడానికి రాహుకాలం, యమగండం, వర్జ్యం చూడ్డం ఇవన్నీ మొదటినుంచి ఎక్కువే. శాస్త్రాలు, పురాణాలు చదివినా, ఇంగ్లీషు చదువు చదివి, ఉద్యోగం చేసి, సొంత ఇల్లు కట్టుకుని కాలక్షేపం చేస్తున్నాడు. ఆయన రిటైరైనప్పటి నుంచి ఆ పిచ్చి మరింత ఎక్కువైంది.

ఒక కొడుకు పుట్టాక చాలాకాలానికి లలిత పుట్టింది ఆయనకు. లలిత తండ్రికి పూర్తి వ్యతిరేకం. తుమ్మితే ఏ పని చెయ్యొద్దన్నా, ఆ పని తప్పక చేస్తుంది. ఇక ఆ పనిలో ఏ పొరపాటైనా వస్తే తండ్రి చీవాట్లు, తండ్రితో పోట్లాట ఆ తండ్రి కూతుళ్ళ పోట్లాటలు తీర్చలేక ఆ తల్లి సతమతమవుతూంటుంది.

జాతకాలను, శకునాలను నమ్మవద్దంటుంది లలిత. అవి లేకపోతే ప్రపంచమే లేదంటాడు రామశర్మ.

లలిత అన్నయ్య ఉద్యోగ రీత్యా బైట వూళ్లోనే వుంటున్నాడు. అతని పెళ్లికి పిల్లలను చూసిచూసి విసిగిపోయి, తండ్రి ఎవరిని చేసుకోమంటే వాళ్ళనే చేసుకుంటానని, ముహూర్తం పెట్టి, పిలిపించమని చెప్పి వెళ్ళిపోయాడు.

కొడుకు కోసం పిల్లను చూడడానికి పండ్లు, పూలు తీసుకు రావడానికి బైలు దేరినప్పుడే 'ఆమె' శకునం వచ్చింది రామశర్మకి. ఆయన అనుకున్నట్లుగానే పిల్ల జాతకం, పిల్లాడి జాతకం సరిగా సరిపోయాయి. మిగిలిన విషయాలు మాట్లాడు కున్న తర్వాత ముహూర్తం పెట్టించి, అబ్బాయికి ఫోన్ చేశాడు శర్మ.

అన్నయ్య పెళ్ళికి హడావిడంతా లలితదే. స్నేహితురాళ్ళందరినీ పిలిచింది.

రామశర్మ లలితను పిలిచి "లలితా! ఈ వీధిలో తెల్లగా, కాస్త సన్నగా నుదుట ఇంత కుంకుమ పెట్టుకుని, ఒకావిడ వెళ్తుంటుంది చూశావామ్మా" అని అడిగాడు.

"ఆ! ఎవరబ్బా! కాస్త తల నెరిసినట్టుంటుంది. ఇద్దరు పిల్లలను తీసుకుని వెళ్తుంటుంది. ఆవిడా!" అని అడిగింది కాస్త వివరించి.

"ఆ! ఆవిడే. ఎవరావిడ? మన వీధిలో ఎక్కడుంటుంది?" ఆత్రంగా అడిగాడు రామశర్మ.

## ఆగర్భ శ్రీమంతుడు

ఏ రోజు స్వేదంతో
ఆరోజే
జఠరాగ్నిని
చల్లార్చుకునేవాడు
ఆశల ఆసరా లేకుండానే
ఆనందాలను
సృష్టించుకునేవాడు
ముప్పూటలా
కలో గంజో
పట్టెడు మెతుకులో
తాగో తినో
గట్టుపైనో
చెట్టు నీడనో
గుండెపై చేయి వేసుకొని
నిశ్చింతగా
నిద్రించే వాడే సుమా
అసలు సిసలు
ఆగర్భ శ్రీమంతుడు

-బద్ది నాగేశ్వరరావు

"మనింటికి నాలుగో ఇల్లే. అయినా, ఆవిడతో ఏం పని?" సాగదీసింది లలిత.

"అబ్బే! ఏం లేదు. మొన్న అన్నయ్య పెళ్ళి విషయమై వెడుతుంటే, ఆవిడే ఎదురొచ్చింది. వాడి పెళ్ళి పని ఈసారి అతి సులభంగా ముగిసింది. తర్వాత కూడా మూడుసార్లు ఆవిడ ఎదురొస్తే, వెళ్లిన పనులన్నీ సాఫీగా జరిగిపోయాయి. ఆవిడ 'శకునం' చాలా మంచిది లాగుంది" అన్నాడు శర్మ.

"మళ్ళీ మొదటికొచ్చావా నాన్నా? వాళ్ళిద్దరికీ పెళ్ళి జరగాలని రాసి వుంది. జరుగుతోంది. అంతేగాని శకునాలేంటి? చెబితే వినవు. ఏది ఎలా జరగాలని రాసి వుంటే అదలా జరుగుతుంది నాన్నా" అంది లలిత ఆవిడ శకునంతో పని లేదన్నట్టు.

"సరేలే. నీతో నేను వాదించలేను. కాని, నీకు ఈ వీధిలో ఎవ్వరూ ఫ్రెండ్స్ లేరన్నావు. పోనీ ఆవిడతో కాస్త మాటలు కలుపుకుని, స్నేహం చేయకూడదు'' అంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు శర్మ.

ఆమె పేరు శారద. టీచరుగా పని చేస్తోంది. ఇద్దరు పిల్లలు.

తలుపు చప్పుడైతే తీసింది శారద. 'నమస్కారమండీ అంటూ లలిత పరిచయం.

"ఓ హో! నువ్వు జాతకాలు చూసే రామశర్మ గారమ్మాయివన్న మాట, రా కూర్చో" అంటూ శారద లలితకు కుర్చీ చూపించింది. "మీ పిల్లలేరి" అడిగింది లలిత.

"ఇప్పుడే స్నేహితులు యింటికి ఆడుకోడానికి వెళ్ళారు" అంది శారద. ఆమె భర్తను గురించి అడుగుదామనుకుని, ఇంకోసారి అడగ వచ్చునని వూరుకుంది. లలిత. తర్వాత కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్న తర్వాత లలిత ఇంటికొచ్చేసింది.

ఓ పది రోజుల తర్వాత అన్నయ్య పెళ్ళి శుభలేఖ తీసుకుని శారద ఇంటికి వెళ్ళింది లలిత.

''రా, రా, మళ్ళీ చాలా రోజుల తర్వాత కనిపించావు. ఏమిటి విశేషం?" సాదరంగా ఆహ్వానించింది శారద.

"మా అన్నయ్య పెళ్ళండి. మరి బట్టలు, నగల సెలక్షన్ నాదే కదా. ఆ హడావుడిలో కాస్త బిజీగా వున్నాను" అంది లలిత గర్వంగా.

"అవునవును, మా అన్నయ్య పెళ్ళికి నాకు చాలా సందడిగా, సరదాగా వుండేది. మరి ఆడపడుచులం అర్ధ మొగుళ్ళం కదా" అనేసరికి ఇద్దరూ నవ్వేశారు.

"ఆ.. మీ వారి పేరు చెప్పండి. కార్డు మీద రాసి యిస్తాను" అంది లలిత.

దాంతో శారద ఒక్కసారిగా దుఃఖం పొర్లుకొచ్చి విచారంతో అంది. ''ఏం చెప్పమంటావమ్మా, ఆయన స్కూటర్ యాక్సిడెంట్‌లో పోయారు".

లలిత గుండెలు ఒక్క క్షణం కొట్టుకోవడం మానేశాయి. 'ఈవిడ 'విడో' నా?' అని మనసులో అనుకుని ఒక్కసారి గట్టిగా వూపిరి పీల్చుకుంది.

మెల్లిగా అంది లలిత "మరి మీరు బొట్టు...." మాట ముగించలేదు లలిత. ''అన్నయ్య నా మొహాన బొట్టు లేకుండా చూడలేనన్నాడు. పిల్లలు కొంచెం పెద్దయినప్పటి నుంచి బొట్టు పెట్టుకోమని ఒకటే గోల. అదీగాక నా మనసులోనే వున్న మా వారిని మరువలేక ఎప్పుడూ బొట్టు పెట్టుకుంటాను" అంది భారంగా శారద.

అంత జాతకాలు, శకునాల పిచ్చి వున్న నాన్న మరి ఈవిడ శకునం మహాగొప్పదని నమ్మాడు. ఇప్పుడేమైంది? ఆలోచించసాగింది లలిత.

"ఏమిటో ఆలోచిస్తున్నావు" అడిగింది శారద.

"ఏం లేదండి. ఇక వెళ్లి వస్తా' ఇన్విటేషన్స్ యింకొందరకివ్వాలి" అంటూ హడావుడిగా బైలుదేరింది. పెళ్ళికి మీరు తప్పక రావాలి, వస్తా మరి. నాన్నకు ఈ విషయం చెపితే ఈ దెబ్బతో జాతకాల జోలికి, శకునాల జోలికి పోడు. ఆవిడ శకునం అంత గొప్పదని నమ్మాడు. అసలు విషయం గబగబ చెప్పేయాలని యిల్లు చేరింది లలిత.

"ఇచ్చావా ఇన్విటేషన్? అమ్మయ్య! మొదటి ఇన్విటేషన్ ఆవిడకిచ్చాం. ఇంక అన్నీ సవ్యంగా జరుగుతాయి'' అని సంతోషంతో ఉక్కిరిబిక్కిరవుతున్న నాన్నను చూసి నోటమాట రాలేదు లలితకు.

■